క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంకర్‌పల్లి: విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా కరెంట్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ ప్రదీప్ కుమార్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు మండలంలోని ప్రొద్దటూరు,టంగటూరు,ప్రగతి రిసార్ట్స్, మొయినాబాద్ మండలంలోని వీరన్నపేట్,మేడిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

నందిగామ: మండలంలోని మేకగూడలో రోడ్డుకు పక్కనే ఓ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. స్థానిక బస్‌స్టాప్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు దీన్ని రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

చైర్మన్ అబ్దుల్లా సాది



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్లా సాది తదితరులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చైర్మన్ అబ్దుల్లా సాది తెలిపారు. మున్సిపాలిటీ పరిధి పహాడీషరీఫ్ 14వ వార్డులో రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని జల్‌పల్లి, పహాడీషరీఫ్, కొత్తపేట, షాహిన్‌నగర్ ప్రాంతాల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.10 కోట్లతో కొనసాగుతున్న బాక్స్ డ్రెయిన్ పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంత్రి సబితారెడ్డి చొరవతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు దస్తగిర్, షరీఫ్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు

మహేశ్వరం: డబీల్‌గూడ గ్రామాభివృద్ధికి తన వంతు కృషిచేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని డబిల్‌గూడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం మంత్రిని ఆమె నివాసంలో కలిశారు. డబిల్‌గూడ–శంషాబాద్ రోడ్డు వరకు 800 మీటర్ల బీటీ నిర్మాణం చేయాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ రోడ్డు విస్తరణ, బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ.15లక్షల నిధులు మంజూరు చేశామని.. నిధులు సరిపోకపోతే అదనంగా నిధులు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. మహేశ్వరం–పెద్ద గొల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు వయా మన్సాన్‌పల్లి చౌరస్తా బీటీ రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా నిర్మాణం చేస్తామన్నారు. మహేశ్వరం–స్టేషన్ తిమ్మాపూర్ వయా అమీర్‌పేట్ బీటీరోడ్డును కూడా విస్తరిస్తామన్నారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్, ఇస్తారీ, జంగయ్య, రాములు, కరుణాకర్, భానుప్రకాష్ సత్తయ్య, బాలకృష్ణగౌడ్, మహేందర్, సంజీవ, ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : ఎంపీపీ

మహేశ్వరం: మహేశ్వరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె గురువారానికి 14వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి మద్దతు ప్రకటించారు. జేపీఎస్‌ల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం, కందుకూరు, ఆమనగల్, కడ్తాల్, తలకొండపల్లి మండలాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు గద్దర్ ఆశీర్వాదం



నూతన వధూవరులతో గద్దర్, మాజీ ఎమ్మెల్యే రత్నం తదితరులు

చేవెళ్ల: మండలంలోని ముడిమ్యాల గ్రామంలో గురువారం నూతన వధూవరులను ప్రజా గాయకుడు గద్దర్ కలసి ఆశీర్వదించారు. బీజేపీ సీనియర్ నాయకుడు శేరి నర్సింగ్‌రావు కుమారుడు భరత్‌రావుకు సంజనతో ఇటీవల వివాహం జరిగింది. వీరిని గద్దర్ తోపాటు చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు దర్శన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం

- అందుబాటులో 13.90లక్షల మొక్కలు
- లక్ష్యాన్ని చేరితే మరింత పచ్చగా పల్లెలు
- పర్యవేక్షణలో నిమగ్నమైన అధికారులు



ఎలికట్ట గ్రామ నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

షాద్‌నగర్: పల్లెలను పచ్చగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామానికి ఓ నర్సరీని ఏర్పాటు చేసి అందులో మొక్కలను పెంచే కార్యక్రమాన్ని చేపట్టింది. వర్షాలు పడితే పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇందుకు గాను నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. హరిత లక్ష్యాన్ని చేరుకుంటే పల్లెలు పచ్చగా మారనున్నాయి.

ఊరికో నర్సరీ

షాద్‌నగర్ నియోజకవర్గంలో 152 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం హరితహారం కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు కార్యదర్శులను భాగస్వాములు చేసింది. హరితహారంలో లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఎర్రమట్టి, పశువుల పేడ మిశ్రమాన్ని ఉపయోగించి మొక్కలను పెంచుతున్నారు. ఎండ తీవ్రత నుంచి మొక్కలను కాపాడేందుకు పచ్చని పందిళ్లు వేశారు. అయితే ఈ సారి దానిమ్మ, జామ, గుల్‌మోహర్, కరివేపాకు, మునగ, చింత, బొప్పాయి వంటి పండ్ల మొక్కలతో పాటుగా శుభకార్యాల్లో అలంకరణకు వినియోగించే సిసోడియా మొక్కలను పెంచుతున్నారు.

పచ్చదనమే లక్ష్యంగా

అంతరించి పోతున్న అడవుల శాతాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నర్సరీలను ఏర్పాటు చేస్తోంది.

ప్రత్యేక చర్యలు

ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీల్లో భారీగా మొక్కలను పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పెంచిన ప్రతి మొక్కనూ కాపాడాలనే లక్ష్యంతో పని చేస్తున్నారు. నర్సరీల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

పలు రకాల మొక్కలు

ఉపాధి హామీ నర్సరీల్లో అన్ని రకాల మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పచ్చదనాన్ని పెంపొందించడంలో భాగంగా ప్రజలకు నీడనివ్వడంతో పాటుగా ఫలాలను అందించే మొక్కలను పెంచుతున్నారు. నర్సరీల్లో సుమారు 20 రకాల మొక్కలను పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గోరింటాకు, టేకు, శిశు, మహాగణి, టికోమోర్, పారిజాతం, ఉసిరి, జామ, కర్జూరా, దానిమ్మ, నిమ్మ, బొప్పాయి, వెదురు, మునగ, సంపంగి తదితర మొక్కలను పెంచుతున్నారు.

ప్రత్యేకంగా దృష్టి సారించాం



పల్లెల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపడుతోంది. నర్సరీల్లో మొక్కలు పెంచే కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాం. మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– మాధవి, సర్పంచ్, లింగారెడ్డిగూడ

మొక్కలు సిద్ధం



హరితహారంలో నాటేందుకు అవసరమైన మొక్కలను సిద్ధం చేస్తున్నాం. నర్సరీలో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నాం. వర్షాలు పడగానే మొక్కలు నాటే పనులు ప్రారంభిస్తాం. తరువాత వాటి సంరక్షణ చర్యలు తీసుకుంటాం.

– అరుణ, ఏపీఓ, ఫరూఖ్‌నగర్

మండలం	పంచాయతీలు	పెంచుతున్న మొక్కలు లక్షల్లో
ఫరూఖ్‌నగర్	47	3.25
నందిగామ	18	1.76
కొత్తూరు	12	1.26
కొందుర్గు	22	2.20
కేశంపేట	29	3.03
జిల్లేడు చౌదరిగూడ	24	2.40

అంధత్వ నివారణకే 'కంటి వెలుగు'

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



వృద్ధుడికి కంటి అద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: అంధత్వ నివారణకే కంటి వెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని నాంచేరి గ్రామంలో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు కంటి సమస్యలతో బాధపడరాదనే సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి సమస్యలు ఎక్కువగా ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సక్కుబాయి, చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ వెంకట రంగారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, అమరేందర్‌గౌడ్, కంటి వెలుగు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

ఎంపీపీ విజయలక్ష్మి



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతి

చేవెళ్ల: విద్యాభివృద్ధి జరిగినప్పుడే ప్రగతి సాధ్యమని ఎంపీపీ ఎం విజయలక్ష్మి అన్నారు. చేవెళ్ల ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం మండలంలో పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు, వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను, ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థినికి, వారి తల్లిదండ్రులకు అభినందన, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం మాలతి మాట్లాడారు. విద్య లేకుంటే సమాజంలో గుర్తింపు ఉండదన్నారు. పోటీకి తగిన విధంగా విద్యాభ్యాసం చేయాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇంటర్ ఫలితాల్లో చేవెళ్లకు చెందిన విద్యార్థి హర్షిత రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన కందవాడ పాఠశాల విద్యార్థిని వడ్ల వైష్ణవి, ఆదర్శ పాఠశాలకు చెందిన రిషిత, శ్రీనిధిలను అభినందించారు. అలాగే వంద శాతం ఉత్తీర్ణత శాతం సాధించిన ఖానాపూర్, ఆలూరు బాలికల పాఠశాల, కౌకుంట్ల, తంగడపల్లి, అంతారం పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ అక్బర్, ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టీనావతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ ప్రశాంతిరెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అవినాశ్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి

షాబాద్: రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకుంటుందని జెడ్పీటీసీ పీ అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కే ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సర్దార్‌నగర్ మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ స్వరూప, ఎంపీటీసీ వనితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి,ఎంపీడీఓ అనురాధ, ఏఈఓలు లిఖిత, రాఘవేందర్, గీతా, సోనీశ్రీ, సర్పంచులు స్వరూప, చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ నర్సింహులు, నాయకులు మల్లికార్జున్‌గౌడ్, సర్వేశర్, దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

గ్రామాలు అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సర్దార్‌నగర్‌లో రూ. 40 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సర్పంచ్ స్వరూప, ఎంపీటీసీ వనితతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కావాల్సిన నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇందిరమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాల్సిందే

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య

షాద్‌నగర్: పంచాయతీ జూనియర్ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ జంగయ్య డిమాండ్ చేశారు. షాద్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు చేపడుతున్న దీక్షకు గురువారం సీపీఐ నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. నిధులు, నీళ్లు, నియామకాల కోసం తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరాశే మిగులుతోందన్నారు. పంచాయతీ జూనియర్ కార్యదర్శులను విధుల్లోకి తీసుకునేటప్పుడు ప్రభుత్వం వారితో మూడేళ్ల ప్రొబేషనరీ ఒప్పందం కుదుర్చుకొని, తర్వాత రెగ్యులరైజ్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నిబంధనలు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జేపీఎస్‌లు సమ్మె బాట పట్టడంతో గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పంచాయతీ జూనియర్ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, కిష్టయ్య, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కారక పరిశ్రమపై చర్యలు తీసుకోండి



పరిశ్రమ నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యం

నందిగామ: మండలంలోని నర్సప్పగూడ శివారులో గల కాలుష్య కారక పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లను తయారు చేస్తున్న సదరు పరిశ్రమ నిరంతరంగా నల్లటి పొగను వదులుతోందని, దీంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆరోపించారు. దీంతో పాటు దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఎల్లమ్మ ఆలయంలో బీజేపీ నేతల పూజలు



అమ్మవారి సన్నిధిలో బీజేపీ నాయకులు

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన రేణుక ఎల్లమ్మ తల్లికి గురువారం బీజేపీ నాయకులు అందె బాబయ్య, వెంకటేష్ గుప్తా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ అమ్మవార్ల దయతో గ్రామాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో నేతలు వెంకటయ్య, మనోహర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, జనార్దన్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, చంద్రయ్యగౌడ్, గోపాల్‌గౌడ్, జగన్‌గౌడ్, అశోక్‌గౌడ్, బాలుగౌడ్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం

బడంగ్‌పేట్: పదవ తరగతి ఫలితాల్లో పదికి పది జీపీఏ సాధించిన బడంగ్‌పేటకు చెందిన లార్డ్స్ స్కూల్ విద్యార్థులను గురువారం యాజమాన్యం ఘనంగా సన్మానించింది. పదికి పదితో పాటు ఇతర గ్రేడ్‌లలో నిలిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీలత, అనురాధ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తాచాటిన భాష్యం విద్యార్థులు..

మీర్‌పేట: పదో తరగతి ఫలితాల్లో మీర్‌పేట భాష్యం స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్స్ శ్రుతి, ప్రవంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 మంది విద్యార్థులు 10/10, 14 మంది 9.8, అదే విధంగా 91 మంది విద్యార్థులు 9 జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జోనల్ ఇన్‌చార్జి అంకమ్మరావు, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

కందుకూరు: వీఓఏల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందని సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజు, వీఓఏల సంఘం నాయకురాలు శారద హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ వీఓఏలు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన సమ్మె గురువారానికి 26వ రోజుకు చేరింది. రోడ్లపైకి వచ్చి పోరాటం చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో వీఓఏలు రజినీ, శారద, మాధవి, రాధ, సంతోష, శశికళ, రూన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరుపై హర్షం



మంత్రి సబితకు కృతజ్ఞతలు తెలుపుతున్న రాజేందర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరు చేసిన సందర్భంగా గురువారం స్థానిక కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సబితా రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వందేళ్ల చరిత్ర కలిగిన వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంపై కార్పొరేటర్ హర్షం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసినవారిలో ఆలయ ఫౌండర్, చైర్మన్ రాజా సంజయ్‌గోపాల్, ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన అర్చకులు రాఘవాచారి ఉన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

మీర్‌పేట: పట్టణంలోని శివసాయినగర్ కాలనీలో వెలసిన లక్ష్మీగణపతి ఆలయ 10వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉదయం స్వామివారికి పల్లకీ సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

ఆలయాన్ని కూల్చివేయడం దారుణం



కూల్చివేసిన ఆలయాన్ని పరిశీలిస్తున్న నేతలు

షాద్‌నగర్ రూరల్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట యాడి మాత ఆలయాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఆలయం కూల్చివేసిన ప్రదేశాన్ని బీజేపీ, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, హిందూ వాహిని, గిరిజన నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్యదైవం చౌడమ్మ యాడీ మాత ఆలయాన్ని కూల్చివేయడం సరికాదన్నారు. రెండు వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని కొంత మంది రియల్ వ్యాపారులు కూల్చివేశారని ఆరోపించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మురళి, వెంకటేష్, అశోక్, శేఖర్, మోహన్‌సింగ్, లష్కర్ నాయక్, శివరాజ్ నాయక్, వాల్య నాయక్, శంకర్, కిషన్, లింగం, శ్రీరామ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'పీపుల్స్ మార్చ్'ను జయప్రదం చేయాలి

పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి, భీంభరత్

షాబాద్: చేవెళ్ల నియోజకవర్గంలో శుక్రవారం సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టే పీపుల్స్ మార్చ్ పాదయాత్రను జయప్రదం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి పీ భీంభరత్ పిలుపునిచ్చారు. గురువారం షాబాద్ మండలం హైతాబాద్, మద్దూర్, మాచన్‌పల్లి గ్రామాల్లో పాదయాత్ర ఏర్పాట్లను చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షులు సీ సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 57వ రోజు షాబాద్ మండలంలో 11, 12వ తేదీల్లో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టే పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఉంటుందని తెలిపారు. ఉదయం 8గంటలకు శంషాబాద్ మండలం రామంజపూర్ నుంచి పాదయాత్ర ప్రారంభమై షాబాద్ మండలం మద్దూర్ చేరుకుంటుందన్నారు. హైతాబాద్, చందనవెల్లి భూనిర్వాసితులను కలిసి వారితో సమావేశమై వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. అక్కడి నుంచి మాచన్‌పల్లి, నాగర్‌కుంట, షాబాద్ గ్రామానికి చేరుకుని రాత్రి కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. 13న షాబాద్ మండలం మరియాపూర్ మీదుగా రేగడి చిల్కమర్రి వరకు యాత్ర సాగుతుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సీ సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, చేవెళ్ల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంటారెడ్డి, సీనియర్ నాయకులు రాంరెడ్డి,వసంతం, దర్శన్, మాణయ్య, రసీద్ పటేల్, ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, జయమ్మ, నాయకులు రవీందర్, శేఖర్, జనార్దన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పెంటారెడ్డి, రాజుగౌడ్, సత్యనారాయణచారి, ప్రశాంత్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



విగ్రహాలకు అభిషేకం చేస్తున్న పూజారులు

షాద్‌నగర్: మండలంలోని దూసకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గణపతి, పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి దంపతులు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాలకు జలాభిషేకం, క్షీరాభిషేకం, ధాన్యాభిషేకం చేశారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

కళాజ్యోతి సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



కళాజ్యోతి సభ్యులతో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

కేశంపేట: మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో కొలువుదీరిన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి హోమంతో పాటు కళాజ్యోతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. తాండూరు, వికారాబాద్, సిరిగాయపల్లి, పెద్ద ఉమ్మెంత్యాల, పూడూర్, కొడంగల్, దైవలగూడ, షాబాద్ పాలమూర్ గణేష్, వెంకటేశ్వర అకాడమీ సభ్యులు భజన, రంగస్థల పద్యాలను ఆలపించారు. గురువారం తెల్లవారుజామున వరకు కార్యక్రమం సాగింది. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కళాజ్యోతి సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత రమేష్, ఆంజనేయులు, ప్రణీత్, శ్రీకాంత్, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

హుడాకాలనీలో అధికారుల పర్యటన



కాలనీవాసులతో మాట్లాడుతున్న అధికారులు

హుడాకాంప్లెక్స్: పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాం విత్ కాలనీ అసోసియేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులు సరూర్‌నగర్ డివిజన్ పరిధి హుడాకాలనీలో పర్యటించారు. వర్షం పడినప్పుడు రోడ్ నం–10లో నీరు నిల్వ ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని, సీసీరోడ్డు వేస్తే సమస్య పరిష్కారమవుతుందని, ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, దెబ్బతిన్న అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు అధికారుల దృష్టికి తెచ్చారు. త్వరలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ ప్రశాంతి, సతీష్, జలమండలి అధికారి శంకర్, బీఆర్‌ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.